


నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి విజిట్

ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. రికార్డు ప్రకారం 105 మంది విద్యార్థులు భోజనం చేయాలి. ఆదివారం కేవలం 15 మంది విద్యార్థులే ఉన్నారు. వారికైనా మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించారా..? అంటే అదీలేదు. నీళ్ల చారు, ముద్దన్నంతో సరిపుచ్చారు. కేర్‌టేకర్, ట్యూటర్లు అందుబాటులో లేవు. పెద్దహరివాణంలో ఒక్కటే కాదు.. జిల్లాలో ముప్పాతిక శాతం సీజనల్ హాస్టళ్ల పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. కరువు కోరల్లో చిక్కుకొని.. బతుకుపోరులో రైతులు, కూలీలు ఊరుగాని ఊళ్లకు వలస వెళితే.. వారి పిల్లల చదువులు మధ్యలో ఆగిపోకూడదని, ఆ చిన్నారులకు ఆకలి తీర్చాలనే లక్ష్యంగా ప్రభుత్వం కాలానుగుణ వసతి కేంద్రాలు (సీజనల్ హాస్టళ్లు) ఏర్పాటు చేసింది. అయితే ఇవి కొందరు స్వార్థపరుల దోపిడీ కేంద్రాలుగా మారాయి. అమ్మనాన్నలు వలసలు వెళితే.. ఆకలికేకలతో అలమటించే చిన్నారులకు ఆకలి తీర్చే సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా..? అంటూ పలువురు మండిపడుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' బృందాలు ఆయా సీజనల్ హాస్టళ్లను ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించగా దారుణమైన వాస్తవాలు వెలుగు చూశాయి. ఆ వివరాలు ఇలా..



తుగ్గలి మండలం జొన్నగిరిలో ఇలా కానిస్తున్నారు

సీజనల్ దోపిడీ

- జిల్లాలో విద్యార్థుల వలస నివారణకు 35 హాస్టళ్లు ఏర్పాటు
- ఒక్కో కేంద్రంలో 50 మందికి అవకాశం
- అధిక హాస్టళ్లల్లో అరకొర విద్యార్థులు
- బోగస్ హాజరు చూపి నిధులు నొక్కేస్తున్న సిబ్బంది
- ఆంధ్రజ్యోతి విజిట్‌లో విషయాలు బహిర్గతం

కల్లపరిలో 50 మంది విద్యార్థులకు వడ్డించేందుకు తయారు చేసిన అన్నం



కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అంటే కరువు.. వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మంత్రాలయం, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 2.50 లక్షల కుటుంబాలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాల్లో పత్తి తీత, మిరప కోత పనులకు వలసలు వెళ్లాయి. కన్నవాళ్లతో పాటు చదుకునే విద్యార్థులు కూడా వలస వెళ్తుండడంతో బడిలో హాజరు శాతం తగ్గుతోంది. బడిలో డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతోంది. అమ్మనాన్నలు వలస వెళ్లినా.. పేద విద్యార్థులకు రోజూ మూడు పూటల ఆకలి తీర్చి బడిలో హాజరు శాతం పెంచాలనే లక్ష్యంగా జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లుఏర్పాటు చేశారు. ప్రతి హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించాలి. మధ్యాహ్న భోజనం పాఠశాలలో తింటే.. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం ఈ హాస్టళ్లలో వడ్డించాలి. ఆదివారం వంటి సెలవు రోజుల్లో మధ్యాహ్నం కూడా భోజనం వడ్డించాలి. అమ్మనాన్నలు వలస వెళ్లడంతో ఆలనపాలన బాధ్యతలు ఈ వసతి కేంద్ర నిర్వాహకులే చూడాలి. అందుకుగానూ ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.1,000, కేర్ టేకర్, ట్యూటర్, ఇద్దరు వంట మనుషులు రూ.30 వేలు జీతం చొప్పున ఒక్కో సీజనల్ హాస్టల్‌కు రూ.80 వేలు నిధులు ఇస్తోంది. ఈ లెక్కన జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లకు నెలకు రూ.28 లక్షలు ఖర్చు చేస్తోంది. ఈ నిధులు సమగ్రశిక్ష అభియాన్ ద్వారా కేటాయిస్తున్నారు.



ఆదోని మండలం పెద్దహరివాణంలో సీజనల్ హాస్టల్-1,2లో 105 మందికి గాను హాజరైంది వీరే

అధ్వానం.. అరకొర భోజనం

అమ్మనాన్నలు వలస వెళ్లడంతో ఆకలికేకలతో అలమటిస్తున్న పేద విద్యార్థులకు అన్నం పెట్టి ఆకలి తీర్చే సీజనల్ హాస్టళ్లను నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్నారా..? మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా..? విద్యార్థుల సేవలో ఏమేరకు తరిస్తున్నాయి..? తెలుసుకునేందుకు ఆదివారం పలు సీజనల్ హాస్టళ్లను 'ఆంధ్రజ్యోతి' బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేస్తే అత్యంత దారుణమైన నిజాలు వెలుగు చూశాయి. మెజార్టీ హాస్టళ్లలో సగం కంటే తక్కువ విద్యార్థులే ఉన్నారు. వారికైనా రుచికరమైన భోజనం వడ్డించారా..? అంటే అదీలేదు. నీళ్ల చారు, ఉడికీ ఉడకని ముద్దన్నంతో సరిపుచ్చారు. కేర్ టేకర్, ట్యూటర్లు అందుబాటులో లేరు. 50 మంది విద్యార్థులకు రెండు మూడు కిలోల అన్నం వంట చేశారు. పలు హాస్టళ్లలో రికార్డులు లేవు. సోమవారం వరకు 90-95 శాతం వరకు హాజరైనట్లు హాజరు పట్టీలో చూపించారు. ఆదివారం హాజరే వేయలేదు. ఇదేమని అక్కడ ఉన్నవారిని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదంటూ సమాధానం ఇచ్చారు. కాసుల కక్కుర్తితో పేద విద్యార్థుల కడుపు కొడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాల్సిన మండల విద్యా అధికారులు (ఎంఈవో) తనిఖీలు చేయడం లేదని తెలుస్తోంది.



కౌతాళం మండలం కాత్రికిలో తలుపులు తెరుచుకోని హాస్టల్

అధికారుల తనిఖీలోనూ ఇదే పరిస్థితి

సమగ్రశిక్ష అధికారుల తనిఖీలో కూడా పెద్దఎత్తున నిర్లక్ష్యం, అక్రమాలు వెలుగు చూశాయి. ఈ నెల 18న సమగ్రశిక్ష అభియాన అడిషనల్ ప్రాజెక్టుకో-ఆర్డినేటర్ (ఏపీసీ) టి.శ్రీనివాసులు మండల కేంద్రం కోసిగి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు సీజనల్ హాస్టళ్లు తనిఖీ చేస్తే ఆ సమయంలో తాళం వేశారు. ఆ తరువాత కేర్ టేకర్ వచ్చి తలుపులు తీసినా అక్కడ హాస్టల్ నిర్వహిస్తున్న ఆనవాళ్లు లేవు. రికార్డులు కూడా లేవు. పాఠశాల నైట్ వాచ్‌మనే కేర్ టేకర్‌గా పని చేస్తున్నారు. 19న పత్తికొండ మండలం పదికోన సీజనల్ హాస్టళ్లు తనిఖీ చేయగా.. ఒక చిన్న గదిలో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. 50 మంది విద్యార్థులకు విద్యాభ్యాసం చేయడానికి ఏమాత్రం సరిపోవడం లేదు. అంతేకాదు.. ఒక హాస్టల్‌లో విద్యార్థులు హాజరు కాలేదు. మరో హాస్టల్‌లో 15-20 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అధికారుల తనిఖీలో వెలుగు చూసిన వాస్తవాలు ఇవి. అంటే.. సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులు పేద విద్యార్థుల ఆకలి పేరిట ఏ స్థాయిలో దోపిడీ చేస్తున్నారో ఇట్టే తెలుస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా సమగ్ర విచారణ చేయిస్తే సీజనల్ హాస్టళ్ల పేరిట జరుగుతున్న భారీ అక్రమాల భాగోతం వెలుగు చేసే అవకాశం లేకపోలేదు.

మిగతా 7వ పేజీలో

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్ష

- పేపరు-1కు 86.99 శాతం, పేపరు-2కు 86.84 శాతం మంది అభ్యర్థులు హాజరు
- పరిశీలించిన కలెక్టర్



సెయింట్ జోసెఫ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 30 కేంద్రాల్లో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆదివారం ఉదయం కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డు సెయింట్ జోసెఫ్ కాలేజీని కలెక్టర్ పరిశీలించారు. ఎ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్, ఇందిరాగాంధీ స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలోని కేంద్రాలను జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు గ్రూప్-2 పేపర్-1 పరీక్షలు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించినట్లు వెల్లడించారు. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 9993 మందికి 8693 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షకు 8678 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. పేపర్-1కు 86.99 శాతం, పేపర్-2కు 86.84 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని వెల్లడించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు.

తనిఖీ చేసిన ఎస్పీ

కర్నూలు క్రైం: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షీ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో క్లస్టర్ల వారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మాల్ ప్రాక్టీసు వంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టామన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, నాగరాజరావు, పవన్ కుమార్ ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్నితనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సమస్యలపై గళమెత్తాలి
నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ భవనాలు 7

ఎస్సీ వర్గీకరణ సరికాదు
మాలల యుద్ధ గర్జన మహాసభలో నాయకులు 7

చిన్నారిని చిదిమేసిన లారీ
కన్నబిడ్డ మృతితో తండ్రి షాక్
లారీతో పరారీ అయిన డ్రైవర్



రావణ వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

రావణ వాహనంపై ఆది దంపతులు

- స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ మంత్రి ఆనం
- శ్రీశైలంలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శంఖం పూరిస్తూ..



వేషధారణలో కళాకారులు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి రావణ వాహనంపై విహరించారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబు చేసిన రావణ వాహనంపై ఆశీనులజేసి ఆలయ అర్చకులు, వేదపండితులు అర్చనలు, హారతి పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ రాజగోపురం నుంచి వెలుపలికి తీసుకువచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేశాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, భంజారా నృత్యం, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు కొనసాగింది. రావణ వాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను భక్తులు కన్నులారా వీక్షించారు. గ్రామోత్సవంలో దేవస్థాన ఆలయ అధికారులు, సిబ్బంది, విశేషగా భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం సంప్రదాయ నృత్యప్రదర్శన, భక్తి సంగీత విభావరి, భక్తి రంజనీ, భక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదివారం రాత్రి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీశైల ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే విజయవాడ దుర్గామలేశ్వరస్వామి దేవస్థానం తరపున ఈవో, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సమర్పించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. క్షేత్రంలో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర ఆజాద్ పాల్గొన్నారు.

నేడు పుష్ప పల్లకీ సేవ

మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు సోమవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి ఆనం



కోలాట నృత్య ప్రదర్శన



ఆకట్టుకుంటున్న వేషధారణ



శివపార్వతుల వేషధారణ

'క్లాప్' ఆటోల జప్తు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో చెత్తను తరలిస్తున్న 45 క్లాప్ ఆటోలను బ్యాంకు అధికారులు జప్తు చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం చెత్తను సేకరించేందుకు 95 క్లాప్ ఆటోలను కార్పొరేషన్‌ను అప్పగించింది. ఈ క్రమంలో ఆటోలకు సంబంధించి బాడుగలు, డ్రైవర్ల జీతాలను చెల్లించే విధంగా ఓ ఏజెన్సీకి ఇచ్చారు. చెత్త పన్ను వసూలు చేసి క్లాప్ ఆటోలకు సంబంధించి డబ్బులు చెల్లించేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రెండు రోజుల క్రితం చెత్త పన్ను రద్దు చేస్తూ గవర్నర్ ఆమోద ముద్ర కూడా పడింది. దీంతో ఆటోలకు సంబంధించి ఏజెన్సీ ప్రతినిధులు బ్యాంకులకు డబ్బులు చెల్లించకపోవడంతో 45 ఆటోలను జప్తు చేశారు. ప్రస్తుతం నగర పాలక సంబంధించిన ట్రాక్టర్లతోనే చెత్త సేకరణ జరుగుతోంది.

ఎస్సీ వర్గీకరణ సరికాదు

మాలల యుద్ధ గర్జన మహాసభలో నాయకులు



సభలో అభివాదం చేస్తున్న మాల సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సరికాదని మాల సంఘాల నాయకులు అన్నారు. కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో రాయలసీమ మాలల యుద్ధ గర్జన మహాసభ మాలల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కుట్ర వల్ల ఎస్సీ వర్గీకరణ తీర్పు వచ్చిందని అన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ వర్గీకరణ వల్ల మాల కులస్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. గ్రామ స్థాయిలో వర్గీకరణకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు.మాలల శక్తిగా తయారు కావాలని, అందరూ కలిసి పోరాటం చేస్తేనే ఉద్యమం ఉధృతం దాలుస్తుందన్నారు. సభలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్, విశ్రాంత అధికారి పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే సంతృప్తి

రూ.28 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన బీసీ రాజారెడ్డి



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

మహానంది, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవతోనే సంతృప్తి కలుగుతుందని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.28లక్షలు వెచ్చించి నంద్యాల- అమరావతి జాతీయ ప్రధాన రహదారిలోని గాజులపల్లె సమీపంలో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. నేషనల్ హైవే 544లో నల్లమల కొండ అంచున ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా భోజన వసతి కల్పించారు. రాజారెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులు, వాహనదారులు సర్వనరసింహస్వామి ఆలయానికివెళ్లే భక్తుల దాహం తీర్చడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిద్దలూరు, కంభం, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు, ప్రయాణికులకు దార్తి తీర్చాలన్న ఆలోచనలతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అర ఎకరం కొనుగోలు చేసి విద్యుత్ సౌకర్యం లేకపోయినా సొంత నిధులతో విద్యుత్ సంతంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌లైన్‌లను లాగించామని చెప్పారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు, వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు సమీపంలోని సర్వలక్ష్మీనరసింహస్వామి భక్తులకు కూడా తాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. 11 ఏళ్ల క్రితం బనగానపల్లె - కర్నూలు రహదారిలో బేతంచెర్ల మండలం గోర్లగుట్ట సమీపంలో ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి నేటికీ ప్రయాణికులు, వాహనదారుల దాహార్తిని తీరుస్తున్నట్లు తెలిపారు. అలాగే 10ఏళ్ల క్రితం బేతంచెర్ల మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ మద్దిలేటిస్వామి క్షేత్రంలో భక్తులకోసం మినరల్‌వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాజులపల్లె గ్రామ సమీపంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన బీసీ రాజారెడ్డిని గ్రామస్థులు శాలువా కప్పి గజమాలలతో సత్కరించారు.

ఉచితంగా చికెన్ పకోడీ, ఉడకబెట్టిన గుడ్లు

● ఎమ్మిగనూరులో ఓ కంపెనీ ఆధ్వర్యంలో పంపిణీ



చికెన్ పకోడీ, ఉడకబెట్టి గుడ్లను పంపిణీ చేస్తున్న దుకాణ సిబ్బంది

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని గూడూరు రోడ్డులో ఉన్న ఓ చికెన్ సెంటర్ వద్ద వెన్‌కాబ్ కంపెనీ డీలర్ జహంగీర్ ఆదివారం మాంసం ప్రియులకు కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్ పకోడీ, ఉడకబెట్టిన గుడ్లను పంపిణీ చేశారు. కోళ్లకు వైరస్ సోకుతున్న నేపథ్యంలో వ్యాపారాలు జరగక యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రజలు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ చికెన్ పకోడీ, గుడ్లను ఉచితంగా పంపిణీ చేయడం గమనార్హం. చికెన్ తింటే ప్రమాదమని తినడానికి ప్రజలు భయపడుతున్నారని, వారిలో అపోహ తొలగించడానికి ఉచితంగా పంపిణీ చేశామని డీలర్ చెప్పారు. వెన్‌కాబ్ కంపెనీ ఆధ్వర్యంలో 500 కేజీల చికెన్ పకోడీ, సుమారు 3వేల ఉడకబెట్టిన గుడ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రెండు గుడ్లు, 200 గ్రాముల చికెన్ పకోడీ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నరేంద్ర రెడ్డి ఉన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు: డీఐఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంటర్ విద్యాధికారి సునీత చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లను హెచ్చరించారు. ఆదివారం నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీఎస్, డీవోలకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ అన్ని పరీక్షా కేంద్రాలలో తప్పనిసరిగా తాగునీరు, గాలి, వెలుతురు, సరైన బెంచీలు ఉండేవిధంగా చూడాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, పరీక్ష జరిగే సమయంలో, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేంద్రాలను సీసీ కెమెరాలతో మానిటరింగ్ చేస్తామని, ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పరీక్షల స్పెషల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, డీఈసీ సభ్యులు పీవీ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తాలి



● కరువు జిల్లాలో వెంటాడుతున్న సమస్యలు
● అసంపూర్తి ప్రాజెక్టులకు నిధులు రాబట్టాలి
● రహదారులు మరమ్మతులు సరే.. శాశ్వత పరిష్కారం చూపాలి
● నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
● అమరావతికి బయలుదేరిన కూటమి ఎమ్మెల్యేలు

కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం తొలిసారిగా సంపూర్ణ బడ్జెట్ ఈ నెల 28న ప్రవేశ పెట్టనుంది. నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతికి చేరుకున్నారు. ఈ సమావేశాలకు హాజరు అవుతామని వైసీపీ ప్రకటించడంతో ఆ పార్టీ మంత్రాలయం, ఆలూరు ఎమ్మెల్యేలు కూడా రాజధానికి చేరుకున్నారు. 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. జిల్లాకు చెందిన సమస్యలపై ఎమ్మెల్యేలు గళమెత్తి, నిధులు రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే క్రమంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సమన్వయం చేసుకొని జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ద్వారా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ల దృష్టికి జిల్లా ప్రాధాన్యతా అంశాలను తీసుకువెళ్లి ఎక్కువ నిధులు రాబట్టాలి.

సాగునీటి ప్రాజెక్టులు పట్టాలెక్కించాలి

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.950 కోట్లు నిధులు కావాలని ఇప్పటికే ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. వీటితో పాటు హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు మరో రూ.1,150 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. అవసరమైన మేరకు నిధులు రాబట్టాలి. కరువు.. వలసలు నివారణే లక్ష్యంగా చేపట్టిన వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు సహా గుండ్రేవుల జలాశయం నిర్మాణాలు పట్టాలెక్కించేలా గళం వినిపించాలి.

వీటిపై గళం వినిపించాలి

● ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరంలో 9185 ఇళ్లు, ఆదోని పట్టణంలో 3,800, ఎమ్మిగనూరు పట్టణంలో 3,250, నంద్యాల 5,070 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినా పేదలకు పంపిణీ చేయలేదు. మౌలిక వసతులు లేకపోవడమే ప్రధాన కారణం.

● కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.930 కోట్లతో చేపట్టారు. వివిధ దశల్లో ఆపేశారు. ఈ పనులు మొదలు పెట్టి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

● రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై రూసా నిధులు రూ.20 కోట్లు చేపట్టారు. పునాదులతో ఆగిపోయింది. ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల విస్తీర్ణం, ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం పనులు ఆపేశారు.

● జగన్నాథగట్టుపై 52 ఎకరాల్లో రూ.80 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన 'క్లస్టర్ యూనివర్సిటీ' పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇటీవల రూ.20 కోట్లు ఇచ్చినా కాంట్రాక్టర్ బకాయికే సరిపోతాయి. ఈ కాంట్రాక్టర్ గత వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రికి అత్యంత సన్నిహితుడు అంటున్నారు.

● జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికి కుళాయి కనెక్షన్ కోసం రూ.1,545 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటిపై దృష్టి సారించాలి.

● రోడ్డు భవనాల శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ప్రధాన రోడ్లు మరమ్మతులో సరిపుచ్చారు. శాశ్వత ఆధునీకరణ పనులు చేపట్టేలా గళం విప్పాలి.

● ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు, ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత పక్కా భవనాలు, కోడుమూరు పట్టణం తాగునీటి కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్‌లకు నిధులు రాబట్టాలి.



అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

మద్యం దుకాణం దగ్ధం

పాణ్యం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాణ్యంలోని శ్రీ ఆద్య మద్యం దుకాణం శనివారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ సంఘటనలో దాదాపు రూ. 40 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం అదనంగా వచ్చిన మద్యం సరుకు నిల్వ ఉంచడంతో భారీ నష్టం చోటు చేసుకున్నట్లు తెలిసింది. విద్యుదాఘాతమే ఈ ప్రమాదానికి కారణమని నిర్వాహకులు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే నంద్యాల అగ్నిమాపక, విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంమీద మంటలను ఆర్పివేశారు. సంఘటనా స్థలాన్ని నంద్యాల జిల్లా అగ్నిమాపక అధికారి యోగీశ్వరరెడ్డి, పాణ్యం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఆదివారం పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, అబ్దుల్ రఫి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మంటల్లో కాలిపోతున్న మద్యం బాటిళ్లు

శ్రీశైలంలో శివభక్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్నశివ భక్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో ఆదివారం శివ స్వాములు ఆందోళనకు దిగారు. స్థానికంగా ఉండే సిద్ధరామప్ప వాణిజ్య సముదాయంలోని ఓ దుకాణదారుడు శివ స్వామిని కొట్టాడని అతనిడి షాపును స్వాములు ధ్వంసం చేశారు. అనంతరం నంది సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దుకాణదారుడిని అదుపులోకి తీసుకుని శివస్వాములకు సర్దిచెప్పారు. అయితే మాలధారణలో ఉన్న వ్యక్తి యాచకుడు అని పోలీసులు విచారణలో తేలింది.

సీజనల్ దోపిడీ

(5వ పేజీ తరువాయి)



కోసిగి: కందుకూరులో సీజనల్ హాస్టల్ నడిపే బడికి తాళం వేశారు.. 11.30 గంటల తర్వాత ఆంధ్రజ్యోతి ప్రతినిధి వెళ్లడంతో తలుపులు ఓపెన్ చేసిన దృశ్యం

పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలు

ఆదోని రూరల్: కర్ణాటక సరిహద్దున ఉన్న మండలంలోని పెద్దహరివాణం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకే గదిలో రెండు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. హాస్టల్-1లో 53, హాస్టల్-2లో 52 మంది కలిపి 105 మంది విద్యార్థులు ఉన్నట్లు హాజరు పట్టికలో చూపించారు. రెండు హాస్టళ్ల పరిధిలో ఆదివారం బాలికలు 11 మంది. బాలురు 4 కలిపి 15 మంది విద్యార్థులు ఉన్నారు. కేర్ టేకర్లు, ట్యూటర్లు, వంట మనుషులు అందుబాటులో లేరు. కేవలం మూడు నాలుగు కిలోలు అన్నం, నీళ్లచారు వంట చేశారు. చికెన్ లేదా గుడ్డు చేయాల్సి ఉంటే చేయలేదు. 12 గంటల తరువాత హెల్పర్ ఒకరు వచ్చారు. రోజే ఇదే పరిస్థితి అని స్థానికులు తెలిపారు.

కౌతాళం: మండలంలోని కాత్రికి గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులకు గానూ ఏడుగురే ఉన్నారు. కేర్ టేకర్, ట్యూటర్, వంట మనుషులు లేవు. వాచ్‌మన్ ఒక్కరే ఉన్నారు. ఒకటి రెండు కిలోలు స్వీట్ పొంగల్ (బెల్లం అన్నం) చేశారు. రికార్డులు లేవు. రోజూ ఇదే పరిస్థితి అని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 'మా సారు కర్నూలు నుంచి అప్పుడప్పుడు వచ్చిపోతుంటారు' అని విద్యార్థులు తెలిపారు. కౌతాళంలోని సీజనల్ హాస్టళ్ల పరిస్థితి దాదాపు ఇదే.

కోసిగి: మండలంలోని కుందుకూరు గ్రామంలో ఓ ఇంట్లో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులకు గానూ ఒక్కరు కూడా హాజరు కాలేదు. కేర్ టేకర్, వంట మనిషి ఇద్దరు శ్రీశైలం వెళ్లడంతో రెండు మూడు రోజులుగా హాస్టల్ మూత పడిందని స్థానికులు తెలిపారు. తెరిచిన రోజుల్లో కూడా 15-20 మందికి విద్యార్థులకు మించి రావడం లేదని అంటున్నారు.

కోడుమూరు: మండలంలోని కల్లపరి గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేశారు. స్థానిక స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఈ హాస్టల్ నిర్వహిస్తున్నారు. 12 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వండిన అన్నంను పరిశీలిస్తే రెండు కిలోలకు మించి ఉండదని తెలుస్తుంది. నీళ్ల చారుతో సరిపుచ్చారు.

● తుగ్గలి మండలం జొన్నగిరి, మండల కేంద్రం హోళగుంద, హాలహర్వి మండలం నెట్రవట్టి గ్రామాల్లోని సీజనల్ హాస్టళ్లలో తనిఖీ సమయంలో నిబంధనల మేరకు విద్యార్థులు హాజరైనా పలు కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనాలు వడ్డించలేదని తెలుస్తోంది.

ఎంఈవోలు తనిఖీ చేయాలి



సీజనల్ హాస్టళ్లను ఎంఈవోలు క్రమం తప్పక తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఇటీవల కోగిసి, పత్తికొండ మండలం పందికోన గ్రామంలోని నాలుగు సీజనల్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశాను. రెండు మూడు కేంద్రాల్లో విద్యార్థులే లేరు. ఓ కేంద్రంలో 15-20 మందే ఉన్నారు. రికార్డులు కూడా అందుబాటులో లేవు. కేర్ టేకర్లు, ట్యూటర్లు కూడా లేరని గుర్తించాం. ఆయా కేంద్రాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. కలెక్టరుకు నివేదిక పంపించి ఆయన ఆదేశాల మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

- టి.శ్రీనివాసులు, ఏపీసీ, సమగ్రశిక్ష అభియాన్, కర్నూలు

కేసులు నమోదు చేస్తాం

జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశాం. అమ్మనాన్నలు వలస వెళ్లారనే బాధలేకుండా ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజనాలు వడ్డించడమే కాకుండా చదువు చెప్పిస్తున్నాం. వీటి నిర్వహణపై మండల విద్యా అధికారులు వారంలో రెండు హాస్టళ్లు ఆకస్మిక తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించాం. నిబంధనలు ప్రకారం నిర్వహణ లేకపోతే కలెక్టరుకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటాం. అసరమైతే కేసులు నమోదు చేస్తాం.

- పాల్, డీఈవో, కర్నూలు



కోడుమూరు మండలం కల్లపరి గ్రామంలో 50 మందికి గానూ హాజరైంది వీరే

చిన్నారిని చిదిమేసిన లారీ

● కన్నబిడ్డ మృతితో తండ్రి షాక్
● లారీతో పరారీ అయిన డ్రైవర్



ఆదిత్య నారాయణ (ఫైల్)

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రాక్టీస్ చేసేందుకు ఆ చిన్నారి ఉత్సాహంతో ఉదయమే లేచి స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. నాన్న... నన్ను స్కూల్ వద్ద వదిలిపెట్టు....అనడంతో ఆ తండ్రి బైక్‌పై తన కుమారుడిని దిగబెట్టేందుకు బయలుదేరాడు. లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆ చిన్నారిని చిదిమేసింది. కళ్ల ఎదుటే బిడ్డ లారీ చక్రాల కింద ఛిద్రమై ప్రాణాలు వదలడం చూసిన తండ్రి దిక్కులు పిక్కటిల్లేలా రోదించాడు. ఈ దారుణం ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణంలోని ఎల్బీస్ట్రీట్‌కి చెందిన గురురాజా, ప్రతిభ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో మొదటి అబ్బాయి సత్యానారాయణ 9వ తరగతి, రెండో అబ్బాయి ఆదిత్య నారాయణ(10) ఐదో తరగతి చదువుతున్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం జరగనుండడంతో సాంస్కృతిక కార్యక్రమాల కోసం విద్యార్థులు సిద్ధపడుతున్నారు. ఆదివారం పాఠశాలలో ప్రాక్టీస్ ఉండటంతో నాన్న..నన్ను పాఠశాల వద్దకు దించు అనడంతో ఆ తండ్రి తన బైక్‌పై ఎక్కించుకొని బయలుదేరారు. ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలోని కృష్ణ గుడి వద్దకు రాగానే అతి వేగంగా ఆర్ట్స్ కళాశాల రహదారి వైపు నుంచి లారీ దూసుకొచ్చింది. ఇరుకైనా రహదారి కావడం ఇరుపక్కల వాహనాలు ఉండడం బైకుపై తండ్రి, కొడుకులు ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీని చూసి ఒక్కసారిగా బ్రేకులు వేశారు. బైకు అదుపు తప్పడంతో తండ్రి ఎడమవైపు పడగా, కుమారుడు ఆదిత్య నారాయణ కుడివైపునకు ఒరిగి కిందపడ్డాడు. ఎదురుగా వేగంగా వచ్చిన లారీ విద్యార్థి ఆదిత్యనారాయణ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చుట్టుపక్కల వాళ్లు కేకలు వేస్తూ పరుగులు తీశారు. అక్కడి నుంచి లారీతో పాటు డ్రైవర్ పరారయ్యాడు. తండ్రి షాక్ నుంచి తేరుకొని నాన్నా.. ఆదిత్య ఒక్కసారిలేగునాన్నా.. అంటూ గుండెలు బాదుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లి సంఘటన స్థలానికి చేరుకొని రక్తపుమడుగులో ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి ఒక్కసారిగి కుప్పకూలిపోయింది. స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు అయిన వెంటనే వస్తానని చెప్పి ఇలా కనిపించకుండా కానరాని లోకాలకు వెళ్లావా అంటూ తల్లి రోదిస్తుండడంతో స్థానికుల అందరిని కంటితడి పెట్టించింది. వెంటనే 108 వాహనంలో మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు. లారీతో డ్రైవర్ పరారీ కావడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్ నర్సులకు క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలి


నర్సింగ్ సూపరింటెడెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న హెడ్ నర్సులు, మహిళ స్టాఫ్ నర్సులకు ఐదు రోజుల అదనపు క్యాజువల్ లీవులను మంజూరు చేయాలని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ నర్సింగ్ సూపరిటెండెంట్ ఎస్పీ సావిత్రీబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, ఈసీ సభ్యురాలు శాంతిలత, నర్సింగ్ సూపరింటెండెంట్‌కు కలిసి సమస్యలను వివరించారు.

ఆర్‌వీఎం పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


నమూనాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పాత నగరంలోని ఆర్‌వీఎం (వర్మ ఇంగ్లీషు మీడియం) పాఠశాలలో ఆదివారం విద్యార్థులు ప్రదర్శించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో 101 నమూనాలు చిన్నారులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సందర్శించారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ ఉషారాణి, డైరెక్టర్ సురేష్ వర్మ అభినందించారు.

తిరుమలలో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి


ఆలయ ఆవరణలో సోమిశెట్టి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వేంకటేశ్వర స్వామిని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా నుంచి ఆయన వెంట మాల కార్పొరేషన్ డైరెక్టరు పోతురాజు రవికుమార్, టీడీపీ నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్‌లు ఉన్నారు. అనంతరం సోమిశెట్టి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి మరింత పురోభివృద్ధి సాధించాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నామన్నారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. నగరంలో ఎక్కడైనా కాలనీల్లో సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర పాలక కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏటీఎం కేంద్రంలో చోరీకి యత్నం

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అబ్బాస్‌నగర్‌లో యాక్సిస్ బ్యాంకు చెందిన ఓ ఏటీఎం కేంద్రంలో చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించారు. ఆదివారం తెల్లవారుజామున ఓ ఆగంతకుడు ఏటీఎంలో దూరి మొదటి సీసీ కెమెరాలకు ముఖచిత్రాలు గుర్తించకుండా స్ప్రే చేశారు. అయితే యాక్సిస్ బ్యాంకు ప్రధాన బ్రాంచులో ఉన్న సిబ్బంది సీసీ కెమెరా లో తేడాను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అప్రమత్తమై అబ్బాస్ నగర్‌లోని ఏటీఎం వద్దకు చేరుకోగానే పోలీసులు వస్తున్న విషయాన్ని గుర్తించిన ఆగంతకుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు ఉమ్మడి జిల్లాలో 9వేల మంది రైతులకు రూ.6.6 కోట్ల రాయితీ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే.. టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీ డబ్బులు రైతులకు చెల్లించకుండా అటకెక్కించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో పెండింగ్‌లో ఉన్న రాయితీలను మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

26న బాలనాగమ్మ నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా ఈనెల 26న రాత్రి 7.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో సురభి కళాకా రులతో బాలనాగమ్మ పౌరాణిక పద్య నాటకం ప్రదర్శిస్తున్నట్లు కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరా బాదుకు చెందిన సురభి సాయిసంతోషి నాట్య మండలి ఆధ్వర్యంలో ఈ నాటకం ఉంటుందని తెలిపారు.

● శ్రీశైల క్షేత్రంలో కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న రాత్రి 8 గంటలకు జిల్లాకు చెందిన తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత గాథను తెలియజేసే 'సైసైరా నరసింహారెడ్డి' చారిత్రక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ నాటక ప్రదర్శన ప్రారంభోత్సవానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హాజరవుతు న్నట్లు ఆయన తెలిపారు.

ముళ్ల కంపలతో మూసుకుపోయిన రస్తా


ముళ్ల కంపలతో నిండిన బ్రాహ్మణదొడ్డి నుంచి క్రిష్ణదొడ్డి రస్తా

సి.బెళగల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణదొడ్డి నుంచి క్రిష్ణ దొడ్డికి వెళ్లే రస్తా ముళ్లకంపలతో మూసుకుపోయింది. ఆయా గ్రామాల రైతులు పొలంలో పండిన పంటలను ఇళ్లకు చేర్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ముళ్ల కంపలను తొలగించి గ్రావెల్ రోడ్డు వేయాలని రైతులు కోరుతున్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

● 26న అంకురార్పణ, ధ్వజారోహణం పూజలు
● 27న తెల్లవారుజామున రామేశ్వరస్వామి, అమ్మవార్ల కల్యాణం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 2వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, ఫెస్టివల్ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు కోనేర్లను శుభ్రపరిచి బోరు నీటి నింపడంతో కోనేర్లు కళకళలాడుతున్నాయి. అలాగే భక్తులకు తాగునీరు వసతి, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, పోలీస్ ఔట్‌పోస్టు, మెడికల్ క్యాంపులతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ఇలా..

● ఈ నెల 25న బుగ్గ రామేశ్వరస్వామి కాల్వ గ్రామ వరప్రయాణం
● 26న మహాశివరాత్రి అంకురార్పణ, ధ్వజారోహణం, స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు గురువారం తెల్లవారుజామున 4.25 గంట లకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సం, ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాల వితరణ
● 27న గురువారం సింహవాహన సేవ, ఉదయం 10 గంటలకు నందివాహన సేవ, సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం
● 28న శుక్రవారం సాయంత్రం రథోత్సవం


కాల్వబుగ్గ దేవాలయం

● మార్చి 1న శనివారం పగలు వసంతోత్సవం, సాయంత్రం పార్వేట
● మార్చి 2న ఆదివారం ఉత్సవమూర్తులు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణం

ఈ నెల 26న శివరాత్రి సందర్భంగా రాత్రి 9 గంటలకు పలు సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 27న కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలకు బహుమతులు అందజేయ నున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వస తులు కల్పించామని కాల్వబుగ్గ ఆలయ ఈవో మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని, ఎండలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వసతులు కల్పించామన్నారు.

కాల్వబుగ్గలో మెరుగైన సదుపాయాలు: ఎమ్మెల్యే

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. ఆదివారం శివరాత్రి ఏర్పాట్లను టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రెండు కోనేరులను, పరిసర ప్రాంతాలను పరిశీలించి విగ్రహాలను నీటితో శుభ్రపరిచారు. భక్తులకు 30 వేల వాటర్ ప్యాకెట్లు, 30వేల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భం గా ఆలయ అధికారులను, ఫెస్టివల్ కమిటీ సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యే వెంట ఈవో మద్దిలేటి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, కేవీ మధు, గొల్ల నాగరాజు, బజారు, వేణు, జయకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు


స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

బీసీల హక్కుల కోసం ఉద్యమిద్దాం

బత్తుల లక్ష్మీకాంతయ్య


మాట్లాడుతున్న బత్తుల లక్ష్మీకాంతయ్య

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల కోసం ఉద్యమిద్దామని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్య దర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. ఆదివారం నగరంలోని శశికాంత్ ప్లాజాలోని ఆసంఘం కార్యాలయంలో బీసీ మేధావుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. బీసీ మహిళల సమస్యల పరిష్కారానికి మహిళా విభాగం అధ్యక్షురాలిగా చంద్రకళబాయిని ఎన్నుకున్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. బీసీ నాయకులు చం ద్రశేఖర్ యాదవ్, ధనుంజయ్ ఆచారీ, అయ్యన్న యాదవ్, సంపంగి మల్లయ్య, వడ్డే లక్ష్మన్న, ఆనంద్, గోవిందరాజులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కర్నూలు కేంద్రానికి చెందిన మీరా చేసినవి అసత్య ఆరోపణలేనని రాజయోగి బ్రహ్మకుమార్ రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (మౌంట్ ఆబూ)కు సేవలు అందించడానికి 30 ఏళ్లుగా తన కుటుంబానికి దూరంగా ఉంటూ ఓర్వకల్లు మండల కేంద్రంగా ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలను, దైవ చింతనలు పెంపొందిస్తున్నానని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు అనుసరిస్తూ తాను చేస్తున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, స్పందనను ఆమె జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తూ తనను మానసికంగా, సామాజికపరంగా అవమాన పరిచేవిధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజల సమక్షంలో బహిరంగ విచారణకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఆరోపణలు పునరావృతం అయితే తాను న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని ఆయన తెలిపారు.

జీవోను విడుదల చేయాలి

హమాలీల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న హమాలీలు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ హమాలీలకు సంబంధించిన కొత్త కూలి రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని హమాలీలు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సివిల్ సప్లయ్ గోడౌన్ పక్కన హమాలీ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, క్రిష్ణ అధ్యక్షతన మూడో రోజు హమాలీలు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జేమోహన్ మాట్లాడతూ హమాలీల కూలి రేట్లు జీవోను విడుదల చేయకుండా ప్రభుత్వం కార్మికుల కడుపు కొడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, మధు, రామాంజనేయులు, చిన్నరాజు, పాల్గొన్నారు.

ఆలయంలో సుందరకాండ పారాయణం


సుందరకాండ పారాయణం చేస్తున్న క్రిష్ణుడు

కోడుమూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామంలోని లక్ష్మీ మాధవస్వామి దేవాలయంలో ఆదివారం సుందర కాండ పారాయణం నిర్వహించారు. అమడగుంట్ల గ్రామానికి చెందిన పడిగి క్రిష్ణుడు 12 గంటల పాటు సుందకాండ పారాయణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయుని సుందర రూపానికి దృశ్య మాలిక సుందరకాండ. హనుమంతుడు సాగరాన్ని లంఘించుట, సీతాన్వేషన, లంకాదహనము, సీత జాడను రామునికి తెలియజేప్పుట ఇందులో ముఖ్యాంశాలు అన్నారు. ఆపదల నివారణ కోసం, అభీష్ట సిద్ధి, సంకల్ప జయం కోసం సుందరకాండను పారాయణం చేస్తామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు రాష్ట్రంలో అభివృద్ధి అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తూ సుందరకాండను పారాయణం చేశామన్నారు.

అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

సి.బెళగల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీ జేసన్ హెచ్చరించారు. ఆదివారం సి.బెళగల్, కంబంధహల్, బురాన్‌దొడ్డి, పులకుర్తి తదితర గ్రామాల్లో ఆయన విద్యుత్ లైన్లు, పిండిమిషన్లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఈ సుమంత్, లైన్‌మెన్లు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి రోడ్డులోని వాసవీనగర్ వై.జంక్షన్ సమీపంలోగల ఉమామహేశ్వర ఆలయం ద్వితీయ వార్షికోత్సంలో భాగంగా ఆదివారం ఆలయంలో లింగమయ్య స్వామి, కాలభైరవ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠకు ముందు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలక వర్గ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తామని, అదే రోజు ఉమామహేశ్వర కల్యాణం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉమామహేశ్వరస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

● బాలుర విభాగంలో విజేతగా కర్నూలు జట్టు
● సీనియర్ మహిళల విభాగంలో విశాఖపట్నం

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో కర్నూలు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో గత రెండు రోజులుగా జరుగుతున్న పదో రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర విభాగం పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టు మొదటి స్థానంలో నిలవగా.. రెండో స్థానంలో వెస్టు గోదావరి జట్టు, మూడో స్థానంలో సంయుక్త విజేతలుగా కృష్ణా జిల్లా, ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. అలాగే జూనియర్ బాలుర విభాగంలో చాంపియన్‌గా కర్నూలు జిల్లా జట్టు నిలవగా, రెండో స్థానంలో చిత్తూరు జిల్లా జట్టు, మూడో స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచాయి. నాలుగో స్థానంలో ఈస్ట్ గోదావరి జట్టు నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి రుద్రరెడ్డి అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు సర్వీసెస్ టీమ్ కోచ్ కాశీం సాహెబ్, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యులు నాగేంద్ర, విజయకుమార్, గోపి, స్కేటింగ్ సంఘం కార్యదర్శి సునీల్ కుమార్, యోగా సంఘం కార్యదర్శి అవినాశ్ శెట్టి, షూటింగ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వర్ నాయుడు బహుమతులను ప్రదానం చేశారు. అలాగే వివిధ జిల్లాల కోచ్ మేనేజర్లు, బెస్టు ప్లేయర్ మహిళల విభాగంలో వైజాగ్ చెందిన తులసి, జూనియర్ బాయ్స్ విభాగంలో కర్నూలు చెందిన రియాజ్ బాషాలు ఎంపికయ్యారు.


విజేత కర్నూలు బాలురు జట్టుకు కప్పు అందజేస్తున్న అతిథులు

ఫుట్‌బాల్ టోర్నమెంటు ప్రారంభం


క్రీడాకారులతో మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ పురమెన్ కాలేజీలో ఫుట్‌బాల్ గ్రాస్ రూట్ టోర్నమెంటు పోటీలు ఆదివారం ప్రారంభమైంది. దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయి గోపాల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటే శ్వర్లు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గాడ్గే బాబాకు నివాళి


గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పట్నం రాజేశ్వరి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల వేదిక కార్యాలయంలో గాడ్గే బాబా జయంతి వేడుకలు రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. గాడ్గే బాబా సామాజిక సంఘ కర్త అని వ్యవస్థాపకురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరం యువత ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడ వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్టు గ్రేడింగ్ టెస్టు



వివిధ బెల్టులు సాధించిన క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో బాబు జగ్జీవన్ రామ్ ఓపెన్ పార్కు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆదివారం తైక్వాండో బెల్టు గ్రేడింగ్ టెస్టు ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా బొల్లెద్దుల శేషసాయి ప్రశాంత్ హాజరై మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ నాగన్న, బొల్లెద్దుల సాయి పవన్‌కాంత్, వినయ్, హీరాలాల్, అజయ్, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

3న వాల్మీకుల చలో కలెక్టరేట్


మాట్లాడుతున్న రామాంజనేయులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం మార్చి 3న వాల్మీకుల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మొలగవల్లి రామాంజనేయులు తెలిపారు. ఆదివారం నగరంలోని సీ.క్యాంపు కార్యాలయంలో ఆయన రాష్ట్ర నేత టీ.మురళి నాయుడుతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంటులో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీఆర్‌పీఎస్ జిల్లా కమిటీ నాయకులు బోయ గోవిందన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం వరిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని సీతారామ్ విద్యా సంస్థలో పది, ఇంటర్ ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఫైనల్ ఈయర్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికి జీవితంలో పది, ఇంటర్ అత్యంత కీలకమన్నారు. కార్యక్రమంలో పిన్సిపాల్ రాఘవేంద్ర గౌడ్, టీచర్లు రహిమాన్, భూపాల్‌రెడ్డి, సంజీవమ్మ, భారతీ, అలీ పాల్గొన్నారు.

శివస్వాములకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహమ్మ దీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్‌టేకర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశైలానికి పాద యాత్రగా వెళ్తున్న శివస్వాములకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నగర శివారులోగల జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ముందు మజ్జిగ పంపిణీ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు మన్సూర్ అలీ ఖాన్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ టేకర్ కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి రబ్బాని, సభ్యులు మహబూబ్, రమీజా బాషా, మునాఫ్ పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభం: పాతనగరంలోని నగరేశ్వర స్వామి దేవస్థానంలో శివదీక్షాపరులకు ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అన్నదాన కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

ఆర్థిక స్వావలంభన సాధించాలి



మొక్క నాటుతున్న అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వాలంబన సాధించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అనుపమ పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌కేడీ కాలనీలో రెయిన్బో బోటిక్ ఫ్యాషన్ డిజైన్ షాపును ప్రారంభించారు. నగరాలకే పరిమితమైన ఫ్యాషన్ డిజైన్లు పట్టణానికి పరిచయం చేయడం అభినందనీయమని అన్నారు. సాష నర్సింగ్ హోమ్ అధినేతలు డాక్టర్ మల్లెపూవు కిరణ్ కుమార్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ సీఆర్ రేష్మ పాల్గొన్నారు.

శిలా శాసనాల దారికి మరమ్మతులు



రహదారికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తుగ్గలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అశోకుని శిలాశాసనాల రహదారికి మరమ్మతులు చేస్తున్నట్లు సిబ్బంది బాబు తెలిపారు. ఆదివారం జొన్నగిరి, జి.ఎర్రగుడి గ్రామాల మధ్య ఉన్న ఏ రహదారిని ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో రూ.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. చెత్తాచెదారాని శుభ్రం చేయడంతో గుంతలను చదును చేశారు. టీడీపీ నాయకులు బసన్న, కాంట్రాక్టరు దశరథరామిరెడ్డి ఉన్నారు.

తల్లిదండ్రులకు పేరు తేవాలి



ఏడీ కుళ్లాయప్పను సన్మానిస్తున్న హాస్టల్ వార్డెన్లు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆదోని డివిజన్ బీసీ సంక్షేమ శాఖ ఏడీ రాజా కుళ్లాయప్ప పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేపట్టారు. ఎంతోమంది హాస్టల్లో చదివి, నేడు ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు మంచి విద్య ఇస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయాన్ని వృధా చేసుకోకుండా చదివితే లక్ష్యానికి చేరుకుంటారన్నారు. అనంతరం ఆయనను విద్యార్థులు హాస్టల్ వార్డెన్ మాధప్ప, బాలికల కళాశాల హాస్టల్ వార్డెన్ ప్రమీలమ్మ సన్మానించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హోళగుంద, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు జయ మల్లప్ప స్వామి, మల్లికార్జున స్వామి ఆదివారం తెలిపారు. టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.



పూజలు చేస్తున్న వైకుంఠం శివప్రసాద్

సంత్‌గాడ్గే సేవలు మరువలేనివి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సంత్‌గాడ్గే సేవలు మరువలేనివని, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. సంత్ గాడ్గే బాబా 150వ జయంతి సందర్భంగా ఆదివారం గోవిందప్ప అధ్యక్షతన నివాళి అర్పించారు. నాగరాజు, రవి, నరసింహారాజు, కిషోర్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్నసావిత్రి

ముగిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పత్తికొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో వారం నుంచి జరుగుతున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం ఆదివారం ముగిసింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు యల్లారెడ్డి, తుప్పెదనాగన్న, అర్చకుడు బ్రహ్మయ్యలు ఉన్నారు.

వైభవంగా ఉరుసు



అశ్వాన్ని ఉరేగిస్తున్న భక్తులు

దేవనకొండ,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలతలమర్రిలో ఆదివారం దస్తగిరయ్య ఉరుసు నిర్వహించారు. గ్రామంలో అశ్వాన్ని ఉరేగించారు. దస్తగిరయ్య పాల్గొన్నారు.

పది రోజులకోసారి తాగునీరు

- ఎం.అగ్రహారం ఎస్సీ కాలనీవాసుల ఇబ్బంది
- మురుగు కాలువలో పైపులైన్



మురుగు కాలువలోని కొళాయి నీరు పట్టుకుంటున్న మహిళ

మద్దికెర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ కాలనీలో పది రోజులకోసారి తాగునీరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలో తాగునీటి పైపులైన్లు

గ్రామంలో దాదాపు 6వేల జనాభా నివసిస్తున్నారు. నాలుగు తాగేనీటి పథకాలను కూడా ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందని మహిళలు వాపోతున్నారు. మినీ ట్యాంకులు, బోర్లు పని చేయడం లేదు. పైపులైన్లు పగిలిపోయాయి. దీంతో కాలువలోనే బిందెలతో నీరు పట్టుకుంటున్నారు.

బోరు నీటిలో ఫ్లోరైడ్‌నీరు

గ్రామంలోని బోర్లలో ఫ్లోరైడ్ నీరు ఉంది. సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల్లో అభ్యర్థుల హామీ ఇచ్చారు. అనంతరం విషయాన్ని మరిచిపోయారని గ్రామస్థలు ఆరోపిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ఫ్లోరైడ్ నీటినే తాగాల్సి వస్తోందదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



మా కాలనీలో పది రోజులకోసారి తాగునీరు వదులుతున్నారు. మోటార్లు ఉన్న వారికి మాత్రమే నీరు వస్తుంది. మోటర్ లేకుంటే నీరు రాదు. వేసవి రాకముందే పరిస్థితి ఇలా ఉంటే ఇక వేసవిలో ఎలా ఉంటుందో. **- రాధమ్మ**

సమస్యను పరిష్కరిస్తాం



ఎస్సీ కాలనీలో తాగు నీటి సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే సర్పంచ్ విజయుడు దృష్టికి తీసు కెళ్లాం. సమస్యను పరిష్కరిస్తాం. **- సుధాకర్, ఇన్‌చార్జి కార్యదర్శి**

వెల్దుర్తిలో బైక్ చోరీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో పార్క్‌చేసిన తన స్ప్లెండర్ బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు ఇలియాజ్ తెలిపారు. బాధితుడి కథనం మేరకు.. ఇందిరానగర్‌లో నివాసం ఉంటూ కర్నూలులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ రైల్వేస్టేషన్‌లో బైక్ పార్క్ చేసి రైలులో కర్నూలుకు వెళుతుంటాడు. శనివారం కర్నూలుకు వెళ్లి, సాయంత్రం వచ్చి చూడగా బైకు కనిపించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

6వ తరగతిలో ప్రవేశాలు

మద్దికెర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆదర్శపాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవిత ఆదివాకం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో మార్చి 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలకు రూ.150లు, ఎస్సీ, ఎస్టీలు రూ.75లు చెల్లించాలన్నారు.

పూర్ పాలన

- పురపాలక కార్యాలయంలో తలుపులేని మరుగుదొడ్డి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు సౌకర్యాలను కల్పించాల్సిన ఆదోని పురపాలక అధికారులు తమ కార్యాలయ నిర్వహణ మరిచారు. కార్యాలయంలోని రెండో అంతస్థులో ఉన్న మురుగు దొడ్డి తలుపులు ఊడిపోయాయి. రెండు నెలలు కావస్తున్నా, మరమ్మతులు చేయించడం లేదు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ వైజీ బాలాజీ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. పుర పాలక కార్యాలయంలోనే ఇలా ఉంటే ఇక వార్డులలో ఏం సౌకర్యాలను కల్పిస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



తలుపులు లేని మరుగుదొడ్డి ఇదే..

సీఎస్ఐ చర్చిలో రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న పాస్టర్

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : విక్టోరియా పేట సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రెవ.డాక్టర్ పి.ఐజక్ వరప్రసాద్ నాలుగో కోన్సిగ్రేషన్ డే సందర్భంగా సంఘ కాపరి రెవ. విలియం సుజిత్ ఆధ్వర్యంలో 30 మంది క్రైస్తవులు రక్తదానం చేశారు. అనంతరం వంద మందికి బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ కార్యదర్శి సిమెంట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాలను కాపాడినవారమవుతామని అన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ప్రసాద్, అమృత, సౌజన్య, యూత్ సునీల్, కార్తీక్, అశోక్, షైలర్, ఆనంద్, సాగర్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్నఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

దేవనకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మున్నెప్ప, ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రమీజాబీ, రాధ డిమాండ్ చేశారు. ఆదివారం వైద్యశాలలో సమావేశం నిర్వహించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలన్నారు. విధి నిర్వహణలో మరణిస్తే రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. నర్సారావ్, తులసమ్మ, రాధిక, నాగలక్ష్మి, హైమవతి పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు మతిభ్రమించింది



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు మతిభ్రమించిందని జిల్లా సాధికారకత కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల ఎలాంటి అభివృద్ధి చేయకపోగా.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు 8 నెలల్లోనే తాలుకాలో రూ.15కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఆరోపణలు తగవన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కేంద్ర ప్రభుత్వ సాయంతో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు గొడుగు సతీష్ కుమార్, భీమరాజు, తదితరులు ఉన్నారు.



ప్రమాదకరంగా ఉన్న గుంత

ఆదమరిచారో అంతే..

దేవనకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో మరుగుడ్డి సమీపంలో ఇంకుడు గుంత ప్రమాదకరంగా ఉంది. గుంత తీసిన అధికారులు దానికి పైకప్పు వేయలేదు. అటుగా వెళ్లే సమయంలో విద్యార్థినులు గమనించకుండా వెళ్తే గుంతలో పడిపోయో ప్రమాదముంది.

ధ్యానంతో ప్రశాంతత

మద్దికెర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ప్రశాంతత వస్తుందని శిక్షకుడు అశోక్ నారాయణ అన్నారు. ఆదివారం వశిష్ట పాఠశాలలో రామకృష్ణ హార్ట్‌ఫుల్ ఆధ్వర్యంలో ధ్యానం చేయించారు. ఉదయం సాయంత్రం గంట పాటు ధ్యానం చేస్తే అనారోగ్యాలు దరి చేరవన్నారు. కోఆర్డినేటర్ పక్కీరప్ప, గురు ప్రకాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదానం గొప్పది

తుగ్గలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నదానం గొప్పదని దాత హైదరాబాద్ శ్రీరాములు దంపతులు అన్నారు. ఆదివారం బోడిబండలో మాట్లాడుతూ శివరాత్రి భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. ఫక్కీరప్పస్వామి ఆలయంలో ఈ నెల 26 రాత్రి నుంచి 27వ తేదీ వరకు అన్నదానం చేస్తామన్నారు. దర్మకర్త అప్పా వేణుగోపాల్ సహకారంతో సౌకర్యాలను సమకూరుస్తామన్నారు.

26 నుంచి తిరుణాళ్లు

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుంచు ఎర్రగుడి రామలింగేశ్వర స్వామి తిరణాళ్లు 26 నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 26న అబిషేకం, రాత్రి జాగారణ, భజన పోటీలు, నందికోల సేవ, నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 27న కల్యాణం ఉంటుందని తెలిపారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈ-బీసీ, కాపు, రెడ్డి, వెలమ, వైశ్య అభ్యర్థులకు సబ్సిడీ రుణాల కోసం 25వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆదివారం తెలిపారు. మొత్తం 2,600 మంది దరఖాస్తు చేశారని వీరికి రెండు రోజుల పాటు 19మంది బ్యాంకర్లు ఇంటర్వ్యూలను చేస్తారన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 25వ తేదీన ఉదయం 10 గంటల నుండి 1 నుంచి 10వ వార్డు అభ్యర్థులకు, మధ్యాహ్నం 1-0గంటల నుండి 11వ వార్డు నుంచి 20వ వార్డు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. అలాగే 27వ తేదీ ఉదయం 10గంటల నుంచి 21వ వార్డు నుంచి 31వ వార్డు వరకు, మధ్యాహ్నం 1-0గంటల నుంచి 32వ వార్డు నుంచి 42వ వార్డు వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు కుల, ఆదాయ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ సెట్లతో హాజరు కావాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి

- వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

దేవనకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అలారుదిన్నెలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలైనా హామీలు అమలులో జాప్యం తగదన్నారు. రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, తెర్నేకల్ సర్పంచ్ ఆరుణుకుమార్ పాల్గొన్నారు.

బీజేపీని పటిష్టపరుస్తాం

దేవనకొండ,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీని పటిష్టపరుస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు బొల్లెద్దుల కిరణ్ అన్నారు. ఆదివారం కర్నూలులో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ సమక్షంలో దేవనకొండకు చెందిన వైసీపీ నాయకుడు వీరయ్య పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యదర్శి రంగస్వామి, చిన్నసుంకన్న, జయరాం పాల్గొన్నారు.



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా దేవర

హోళగుంద, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దటామాగి గ్రామంలోని నేరణికి లింగేశ్వర స్వామి పట్టా దేవర ఆదివారం నిర్వహించారు. విగ్రహాలను డప్పు వాయిద్యాల మధ్య వీధుల్లో ఊరేగించారు. 50 జంటలకు సామూహిక వివాహాలు చేశారు.

శివరాత్రికి ముస్తాబు

మద్దికెర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉనన బుగ్గ సంగమేశ్వరుని ఆలయం మహా శివరాత్రికి ముస్తాబవుతోంది. ఆలయానికి రంగు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నెల 26న ఉదయం 4 గంటల నుంచి పంచామృతాభిషేకం, కలశ స్థాపన, నవగ్రహ పూజ మధ్యాహ్నా అన్నదానం, రాత్రి 9 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 12 గంటల తర్వాత పార్వతి బుగ్గ సంగమేశ్వరస్వామి కళ్యాణం, 27న గురువారం ప్రత్యేక పూజలు, అన్నదానం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. 28న శుక్రవారం వసంతోత్సవం ఉంటుందని ఆలయ ఈవో ఈరయ్య తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

దుమ్ము పడుద్ది

- అధ్వానంగా ఆలూరు-ఆదోని రహదారి
- ఇప్పటికే పలుమార్లు స్థానికుల నిరసన



దుమ్ముతో నిండిపోయిన ఆలూరు-ఆదోని రహదారి

ఆలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులు ఆగిపోవడంతో దుమ్ము రేగుతోంది. దీంతో వాహనదారులు, చుట్టూ ఉన్న దుకాణాల వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ఆలూరు-ఆదోని ప్రధాన మార్గంలో నాలుగేళ్లుగా పనులు కొన్నిచోట్ల సంపూర్తి చేయలేదు. ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇటీవల స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు రహదారిపై బైఠాయించడంతో ఆలూరు ఎస్సై దిలీప్ కుమార్ జోక్యం చేసుకుని ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి 20 రోజుల్లో రహదారి పనులు ఆరంబించేలా చూస్తానని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. అలాగే మూడు రోజుల క్రితం ఆలూరుకు వచ్చిన పత్తిపాడు ఎమ్మెల్యే రామంజినేయులు దృష్టికి టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తీసుకెళ్లగా ఆయన నేషనల్ హైవే రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ మురళీతో చర్చించారు. జిల్లా జాతీయ రహదారి ఈఈ శంకర్ రెడ్డి, డీఈ సుధాకర్‌ను వెంటనే పనులు ప్రారంభిచాలని ఆదేశించారు. అలాగే రెండు రోజుల క్రితం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో అధికారులతో కలిసి జాతీయ రహదారిని పరిశీలించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు సీడీపీవో శశికళ



ఆలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు బాలింతలకు పౌష్టిక ఆహారం సక్రమంగా అందేలా చూస్తానని ఆలూరు సీడీపీవో శశికళ తెలిపారు.

ప్రశ్న: ఆలూరు పరిధిలో ఎన్ని మండలాలు, కేంద్రాలున్నాయి?

జవాబు: ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, హోళగుంద మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 176 కేంద్రాలు ఉన్నాయి. 16,080మంది పిల్లలు ఉన్నారు.

ప్రశ్న: అంగన్వాడీ సిబ్బంది వివరాలు?

జవాబు: 172 వర్కర్లు, 168 మంది సహాయకులు నిధులు నిర్వహిస్తున్నారు..

ప్రశ్న: అద్దె భవనాలు ఉన్నాయా?

జవాబు: 64 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా, 29 కేంద్రాలు పాఠశాలల్లో, 83 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి.

ప్రశ్న: ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తా చేస్తారు?

జవాబు: ప్రాజెక్టు పరిధిలో 12ఖాళీలకు దరఖాస్తులను స్వీకరించాం. 4 వర్కర్, 8 హెల్పర్ పోస్టలకు 23 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక నియమకాలు చేపడతాం.

ప్రశ్న: కొందరు సిబ్బంది కేంద్రాలను మధ్యాహ్నానికే మూసివేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి?.

జవాబు: సిబ్బంది అలా చేస్తే విచారించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బంది బాధ్యతగా పని చేయాలి. నేను కూడా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తా.

ఘనంగా ఉరుసు



స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండంలోని హెచ్ కైరవాడి గ్రామంలో వెలసిన అల్లిసాహెబ్ స్వామి ఉరుసు ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెచ్ కైరవాడి గ్రామస్థులే కాక కర్నూలు, బళ్లారి, మహబుబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉరుసు మహోత్సవానికి హాజరయ్యారు. స్వామివారి జీవసమాధిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తమ కోర్కెలను తీర్చాలని స్వామికి ఇష్టమైన ఇసుకను ఎద్దుల బండ్లు, ట్రాక్టర్‌లతో సమర్పించారు. సాయంత్రం గ్రామంలో రేలారేలారే, ఉచిత నాటకప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు స్వామివారి అశ్వాన్ని గ్రామంలో ఊరేగించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నేటి నుంచి బీరప్ప దేవర



చెట్నహళ్లిలో వెలసిన బీరప్ప దేవాలయం

మంత్రాలయం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో వెలసిన బీరప్ప దేవర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం బీరప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి అలంకరణ చేశారు. కల్లుకుంట, మసీదుపురం నుంచి పల్లకిలో స్వామివార్లు చెట్నహళ్లి గ్రామానికి చేరుకుని దేవతామూర్తులను పల్లకిలో పూజలు చేసి ఆదివారం రాత్రి తుంగభద్రకు చేరుకుని అక్కడ పూజలు చేసి తుంగ జలాలతో అభిషేకించి హారతులు ఇవ్వనున్నారు. ఊరేగింపులో స్వామివార్లను గ్రామానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బోనాలు సమర్పించనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ రామాంజులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



దాతలను సత్కరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

కౌతాళం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన విజయ గణపతి ఆలయ అభివృద్ధికి ఆదివారం ఓ భక్తుడు రూ.లక్ష నగదును విరాళంగా దేవస్థానం కార్యాలయంలో అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం ముందు భాగంలో నిర్మిస్తున్న విజయ గణపతి దేవాలయ అభివృద్ధి పనులకు హైదరాబాదు వాస్తవ్యులు ఈర్లదిన్నె హసీని కుటుంబ సభ్యులు రూ.1,00,100 నగదును అందజేసినట్లు తెలిపారు. వీరికి ఆలయ అధికారులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్పస్వామి ఉన్నారు.

'అసెంబ్లీలో వాల్మీకుల ఎస్టీ బిల్లు ప్రవేశ పెట్టాలి'

మంత్రాలయం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి జరుగున్నాయని, సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ బిల్లును ప్రవేశ పెట్టాలని రాష్ట్ర ఐక్యవాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వాల్మీకుల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు అసెంబ్లీలో వాల్మీకుల ఎస్టీ బిల్లుపై చర్చించి బిల్లు ప్రవేశ పెట్టి కేంద్రానికి పంపాలని, అలాంటి వాల్మీకి నాయకులను గుండెలో పెట్టుకుని ముందుతరాలకు సంపూర్ణ మద్దతుగా ఉంటామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎస్టీ బిల్లును కేంద్రానికి పంపితే.. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు బిల్లును పాస్ చేస్తే.. వాల్మీకి కులస్థులు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. వాల్మీకుల సమస్యలు విద్య, వైద్య, ఆరోగ్య, రాజకీయ ఆర్థిక రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నామన్నారు. ఒకే రాష్ట్రంలో వాల్మీకులు ఎస్టీలుగానూ, ఎస్సీ, బీసీలుగా కొనసాగుతున్నామని, ఈ విషయం చంద్రబాబుకు తెలుసునన్నారు. కార్యక్రమం లో వాల్మీకి నాయకులు బీవీ రవిచంద్ర, వెంకటేష్, రాగన్న పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్ల కంపలు

అంత్యక్రియలకు ఇబ్బందులు



ముళ్లకంపల మధ్య శ్మశానం

కోసిగి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 6వ వార్డు సమీపంలో ఉన్న హిందూ, దళితుల శ్మశాన వాటికలో ముళ్ల కంప పెరగడంతో అంత్యక్రియలకు ఇబ్బంది అవుతుందని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన వాటికలో భారీగా ముళ్ల చెట్లు పెరిగాయి. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. శ్మశాన వాటికలో షెడ్డు, నీటి సౌకర్యం ఏర్పాటు చేసి, ముళ్లకంపలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కౌతాళం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదిరె గ్రామంలో ప్రమాదవ శాత్తు గోడ కూలి మృతి చెందిన కోసిగి క్రిష్ణప్ప కుటుంబానికి మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రూ.20వేలను అందజేశారు. గ్రామ పెద్దలు రామయ్య ఆదివారం మాట్లాడుతూ క్రిష్ణప్ప మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆదివారం మృతుడి భార్య దేవమ్మకు రూ.20 వేలు అందజేసినట్లు తెలిపారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు నిల్

- నిల్చునేందుకు నీడ కరువు
- ఎండకు, వానకు ప్రయాణికుల అవస్థలు



గోనెగండ్లలో బస్సు కోసం రోడ్డు పక్కనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బస్‌షెల్టర్ల వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేముగోడు, పుట్టపాశం, హెచ్ కైరవాడి, పెద్దమరివీడు, అలువాల, పెద్దనేలటూరు గ్రామాల్లో బస్‌షెల్టర్లు ఉన్నప్పటికీ అక్కడ బస్సు ఆగదు, ఆగిన చోట బస్‌షెల్టర్ ఉండదు. మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రయాణికులు పరస్థితి మరీ దారు ణంగా ఉంది. ఎండకాలంలో ఎండలో నిలబడాలి, వర్షాకాలంలో చెట్లకిందనో హోటళ్లలోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి. బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోజు వేల సంఖ్యలో ప్రయాణికులు: గోనెగండ్ల మండలంలో దాదాపు 85వేల మంది జనాభా ఉన్నారు. గోనెగండ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. అలాగే మండలంలోని పలు గ్రామాల నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, బళ్లారి, హైదరాబాద్, చెన్నై, తదితర ప్రాంతాలకు పలు పనులపై ప్రయాణికులు వెళ్తుంటారు. మండలంలో 28 గ్రామాలు ఉన్నప్పటికీ దాదాపు 15 గ్రామాలప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే గోనెగండ్ల నుంచే వెళ్లాల్సి ఉంది. ప్రతి రోజు అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు.



పెద్దనేలటూరులో నిరుపయోగంగా బస్‌షెల్టర్

కనీస సౌకర్యాలు కరువు: మండల కేంద్రమైన గోనెగండ్లతోపాటు పలు గ్రామాలలో బస్‌షెల్టర్‌లు ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేవు. కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు లేవు. తాగునీటి సౌకర్యం, మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉండాల్సి వస్తుంది. అయితే బస్సు షెల్టర్‌లో కనీస సౌకర్యాలు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండకు ఎండాల్సిందే



ప్రస్తుత ఎండలకు ప్రయాణికుల ఇక్కట్లు అన్ని ఇన్నికావు. నిలుబడటానికి కూడా నీడ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగేందుకు కూడా నీరు లేక పోవడంతో ప్రయాణికులు అగచాట్లు చెప్పనలవికాదు. ఆర్టీసీ అధికారులు ఎండకాలంలోనైనా తాగేందుకు నీరు ఏర్పాటు చేయాల్సి అవసం ఉంది.

– కౌలుట్లయ్యనాయుడు, గోనెగండ్ల

మహాశివరాత్రికి ఏర్పాట్లు సిద్ధం చేయండి: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా నందవరం మండలంలోని గురుజాల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాట్లన్నీ సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దేవాదాయ, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఆర్టీసీ ఇతర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురుజాల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రోడ్లను బాగు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు సమయపాలన పాటిస్తూ భక్తులకు సకాలంలో బస్సులు నడపాలన్నారు. అగ్నిమాపక అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీతీర ప్రాంతం కావునా గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. భక్తులు స్నానాలు చేసే సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. అలాగే గోనెగండ్ల మండలంలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు బడే సాహెబ్ స్వామి ఉరుసు ఉత్సవానికి సైతం అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. బస్సులను అధిక సంఖ్యలో నడపాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, గోనెగండ్ల, నందవరం ఎంపీడీవోలు, ఈవో రాంప్రసాద్, గురుజాల రామకృష్ణారెడ్డి, నాగరాజుగౌడు, ఖాశింవలి, కృష్ణమనాయుడు, నజీర్ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే బీవీ

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

మంత్రాలయం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. మాఘ దశమి, ఆదివారం సెలవు దినం కావడంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బుధ, గురు, శుక్ర, శని, ఆదివారం వరకు వేలాది మంది భక్తులు రావడంతో మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జిలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషిలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

నేడు ఏకాదశి.. పూజలు బంద్

మంత్రాలయం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకునే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసం పాటిస్తారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో మంచాలమ్మ దేవత

మంత్రాలయం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆదివారం మాఘమాసం దశమి శుభదినాన్ని పురష్కరించుకొని పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలతోపాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి గ్రామంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠను సోమవారం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఉదయం హోమాలు, ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మీలం, కళాజ్వాల, కుష్మాండబలి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన నిర్వహిస్తామన్నారు.

చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి



మహిళలకు చెత్త డబ్బాలను పంపిణీ చేస్తున్న డీఎల్‌పీవో

గోనెగండ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కింద ఆదోని డివిజన్‌లోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలిని డీఎల్‌పీవో నూర్జహాన్ అన్నారు. ఆదివారం గోనెగండ్ల మండలంలోని పుట్టపాశం గ్రామంలో ఆమె పర్యటించారు. మహిళలకు తడిచెత్త, పొడిచెత్త డబ్బాలను అందజేశారు. చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. గ్రామంలోని ప్రజలచే గ్రామ పరిశుభ్రత మన అందరి బాధ్యత అని ప్రమాణం చేయించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ ఉన్న అన్ని చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయని వీటి అన్నింటిని ఉపయోగంలోకి తీసుకువచ్చి వర్మికంపోస్టు ఎరువును తయారు చేసి అమ్మకాలు జరిపి ఆయా పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివాస్ కింద ఈ నెల 15వ తేదీ నుంచి జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. పాశుధ్య కార్మికులు గ్రామాలలోని ఇంటింటి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని ఆ రెండిటిని విడిగా చేసి వర్మి కంపోస్టు ఎరువున తయారు చేసి రైతులకు అమ్మకాలు జరపాలని కోరారు. గ్రామస్థులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్‌డీ అనంతశయన, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు వెంకటేశ్వరాచారి, సీఎం హనుమంతు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు, పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి

నందవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింతలో బండేగురు స్వామి పల్లకోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచే బండేగురు స్వామి మఠంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, అన్నదాన కార్యక్రమాలతో పాటు, మూల విరాట్‌కు ప్రత్యేక పూజ, భజన కార్యక్రమాలు జరిగాయి. మఠం పీఠాధిపతి జయశంకర్‌స్వామి, టీడీపీ నాయకులు ఉప పీఠాధిపతి బండేగురుస్వామి, సర్పంచ్ అక్కామహాదేవి, ఈశ్వర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కర్ణాటక షాపూర్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కర్ణాటక నుంచి మాన్వి మాజీ ఎమ్మెల్యే, మాచాపురం మాజీ సర్పంచ్ కాశీంవలీ, డీవీ రాముడు, గోపాల్, షరీఫ్, గజేంద్రరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కన్నడ సినీ నటుడు



సినీ నటుడు శివరాజ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ కన్నడ సినీ నటుడు శివ రాజ్ కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు మఠం మేనేజరు శ్రీపతి ఆచార్, వెంకటేష్‌జ్యోషి, శ్రీనిధి, రాఘవేంద్ర ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట వ్యాసరాజార్, ప్రకాష్ ఆచార్, అనంత స్వామి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గురువైభోత్సవాలకు దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం

మంత్రాలయం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌లకు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ సురేష్ కోనాపూర్ మఠం ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ ఆహ్వానపత్రికను అందజేశారు. ఆదివారం రాత్రి శ్రీశైలంలో వేర్వేరుగా కలిసి రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం, ఆహ్వానపత్రికను అందజేసి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో ఫోన్‌లో మాట్లాడించారు. ఉత్సవాలకు వస్తానని మంత్రి తెలిపారని శ్రీమఠం అధికారులు తెలిపారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



ఆదెన్న(ఫైల్)

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మిగనూరు పట్టణంలోని యల్లంబీడు ప్రాంతంలో ఓ అద్దె ఇంట్లో మాదుగుండు ఆదెన్న (45) చేనేత కార్మికుడు, భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉండేవాడు. కుమార్తె మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పాటు చేసిన అప్పులు అధికమవుతూ వచ్చాయి. గత రెండు రోజుల క్రితం అప్పు చెల్లించాలని వడ్డీ వ్యాపారులు తీవ్రంగా ఒత్తిడి తెచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఓ వైపు కుమార్తె ఆరోగ్యం సరిగా లేకపోవడం, మరో వైపు అప్పుల బాధ అధికమవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన ఆదెన్న ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. హుటాహుటిన చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే ఆదెన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ చేనేత విభాగం నాయకుల ఆర్థిక సాయం: చేనేత కార్మికుడు ఆదెన్న ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న టీడీపీ చేనేత విభాగం నాయకులు మిన్నప్ప, దేవేంద్ర, పట్నా నాగరాజు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదెన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేడు ఇంటర్వ్యూలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బీసీ కార్పొరేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఉదయం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బంగారమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10గంటలకు ఎంపీపీ సమావేశ భవనంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

ఆదమరిస్తే అంతే

- ప్రమాదకరంగా జీడీపీ కుడి కాలువ కల్వర్టు గట్టు
- సగంలోనే నిలిచిపోయిన ఎడమ కాలువపై బ్రిడ్జి పనులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గాజులదిన్నెప్రాజెక్టు కుడి కాలువ కల్వర్టు

గోనెగండ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు కుడి కాలువ మలుపు దగ్గర ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారింది. కాంట్రాక్టర్‌లు ముందు చూపు లేకుండా కాలువ గట్లకు ఉన్న ప్రహరీని తొలగించి దాదాపు మూడేళ్లు అయ్యింది. కల్వర్టులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్, అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకుండా కాలువ గట్టకు ఉన్న రాతి కట్టడాన్ని ఎందుకు తొలగించారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు, ఎర్రబాడు, ఒంటేడుదిన్నె, గ్రామాలకు ఇదే దారి వెంట వెళ్లాల్సి ఉంది. ఈగ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోలలో ప్రతి రోజు ఇదే దారి వెంట పాఠశాలకు వెళ్తుంటారు. ఇటీవల మలుపు దగ్గర ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన జరిగింది. పత్తికొండకు చాలా మంది ఇదే దారి వెంట వాహనాల్లో వెళ్తుంటారు. కల్వర్టు దగ్గర మలుపును ప్రమాదాన్ని సూచించే బోర్డులు గాని రెడియం స్టిక్కర్‌లు గాని లేక పోవడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమాదాలు జరగకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కుంగిపోయిన జీడీపీ కుడి కాలువ గట్టు